క్లుప్తంగా

నేడు ముత్తుకూరులో మంత్రి కాకాణి పర్యటన

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ముత్తుకూరు మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా పొట్టెంపాడు వద్ద పొంగి పొర్లుతున్న నక్కలకాలువను మంత్రి పరిశీలిస్తారని వెల్లడించారు.

తెగిన విద్యుత్ తీగలు.. సకాలంలో మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

కోవూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా 33/11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో మండలంలోని పలు ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోవూరు ట్రాన్స్‌కో డీఈ సతీష్, ఏఈలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన వర్షంలోనే మరమ్మతుల చర్యలు చేపట్టారు. మొత్తంగా మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

పొదలకూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దోమలు, అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవడం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం చేయాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని పంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకుని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం అధికారులు కిందిస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకోవాల్సిందిగా సూచించారు.

7న సహస్ర దీపోత్సవం

పొదలకూరు : స్థానిక శిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 7వ తేదీన గురువారం సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపారాధన మహోత్సవం జరుగుతుందని మందిర సేవా సమితి సొసైటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. వేయిదీపాల వెలుగులో భక్తులు సాయిబాబాను దర్శించుకోవాల్సిందిగా కోరారు.

13 పునరావాస కేంద్రాలు

నెల్లూరు(బారకాసు): లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం కార్పొరేషన్ పరిధిలో 13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దొరతోపులోని ఎంపీపీ స్కూల్, వైకుంఠపురంలోని ఎమ్సీపీఎస్ కేంద్రం, స్టోన్ హౌస్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్, చిన్నబాలయ్యనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, బాజీతోటలోని ఎంసీపీ స్కూల్, గోమతినగర్‌లోని గోమతి నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కొత్తూరులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్, దర్గామిట్టలోని డీకేడబ్ల్యూ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. కర్నాలమిట్టలోని కార్పొరేషన్ హైస్కూల్, సంతపేటలోని బీఈడీ కళాశాల, పాత మున్సిపల్ కార్యాలయం, గుంటబడి, వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, రంగనాయకులపేటలోని పీఎమ్మార్ హైస్కూల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఆయా కేంద్రాల పర్యవేక్షణకు నగరపాలక సంస్థలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వలంటీర్లను నియమించామన్నారు. వీరంతా నిరంతరం అందుబాటులో ఉంటారని, అవసరమైతే 1800 – 425 – 1113, 0861 – 2301541 కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. కిసాన్‌నగర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిపోయారు. విషయాన్ని గమనించిన స్థానికుడు అబ్దుల్ రెహమాన్ 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే సదరు వ్యక్తి మృతి చెందారు. నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96310 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఎడతెరిపి లేని వర్షం

- పొంగిన వాగులు, వంకలు
- అప్రమత్తమైన అధికారులు
- పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంత ప్రజల తరలింపు



ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు

మనుబోలు : మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో మండలంలో ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరింది. పిడూరు మిక్స్‌డ్ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శివకృష్ణయ్య అధికారులతో కలిసి గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. జేసీబీతో వరదనీరు తొలగింపజేశారు. అలాగే కండలేరులో ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తోంది. వర్షాలకు నీరు మళ్లు నీట మునిగాయి. సోమ, మంగళ వారాల్లో ఇంకా భారీ వర్షాలు కురుస్తాయన్న వార్తల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శివకృష్ణయ్య తెలిపారు. బాధితులకు అవసరమైన పాలు, సరుకులు, బియ్యం, నీటిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తుపాన్ ప్రభావిత ఉండొచ్చని భావిస్తున్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎంపీడీఓ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి, ఈఓపీఆర్డీ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నేతలు సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

వెంకటాచలంలో భారీ వర్షాలు

వెంకటాచలం: మిచాంగ్ తుపాన్ కారణంగా మండలంలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున నుంచి ఎడతెరిపి లేని వర్షంతో ప్రజలు నివాసాలకే పరిమితమయ్యారు. భారీ వర్షాలతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అన్ని గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎగసిపడుతున్న కెరటాలు

ఇందుకూరుపేట : మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో మండల పరిధిలోని తీరప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున్న ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. కాగా ఎడతెరిపి లేని వర్షం కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. నిడిముసలి- ముదివర్తిపాళెం రోడ్డుపై నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రతికూల వాతావరణం ఉండడంతో మైపాడు బీచ్‌కు ఎవరూ రావద్దని కోవూరు సీఐ డి.వెంకటేశ్వరావు కోరారు.

అకాల వర్షం

కోవూరు : డెల్టా ప్రాంతమైన కోవూరు మండలంలో ఇటీవల వరినాట్లు వేసిన రైతులు తుపాన్ ప్రభావంతో ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం పంట పొలాలు పూర్తిగా నీట మునిగి ఉన్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు కాలనీల్లో సిమెంట్ రోడ్లపై కూడా వర్షపునీరు చేరింది. వందేళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలు వర్షానికి ఉరుస్తున్నాయి.



మనుబోలు : లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేస్తున్న అధికారులు



మనుబోలు : గ్రామస్తులకు సూచనలిస్తున్న డాక్టర్ సుబ్బరాజు



మనుబోలు : వర్షానికి నీట మునిగిన నారుమళ్లు



మనుబోలు : నిండుగా ప్రవహిస్తున్న కండలేరు వాగు



ఇందుకూరుపేట : నిడిముసలిలో ఇంటిని చుట్టుముట్టిన వర్షపు నీరు



ఇందుకూరుపేట : నిడిముసలి- ముదివర్తిపాళెం మధ్య నిలిచిన నీరు



కోవూరు : నీట మునిగిన వరినాట్లు



కోవూరు : సిమెంట్ రోడ్లపై ప్రవహిస్తున్న నీరు



వెంకటాచలం: తిక్కవరప్పాడులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



ఇందుకూరుపేట : రాముడుపాళెంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

- జేసీ కూర్మనాథ్
- లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

ఇందుకూరుపేట : మిచాంగ్ తుపాన్ తీవ్రత అధికంగా ఉండనుందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జేసీ కూర్మనాథ్ అన్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన మైపాడు, గంగపట్నం, రాముడుపాళెంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి నష్టాలు వాటిల్లకుండా ముందస్తు చర్యలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అవసరమైన ఆహారం, తాగునీరు, ముందులు అందుబాటులో ఉంచుకోవాలని జేసీ కోరారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

విడవలూరు : తుపాన్ ప్రభావం మండల పరిధిలో ఎక్కువగా ఉంటుందని, రైతులంతా అప్రమత్తంగా ఉండాలని అగ్రికల్చర్ ఏఈ పి.వెంకటకృష్ణయ్య కోరారు. రానున్న మూడు రోజులు నార్లు పోయడం చేయవద్దని సూచించారు. గాలుల తీవ్రత దృష్ట్యా విద్యుత్ తీగలు తెగి పొలాల్లో పడే అవకాశాలు ఉన్నాయని, రైతులు ఈ మూడు రోజులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వెంటనే స్పందించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : తుపాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మెప్మా పీడీ రవీంద్ర సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని అధికారులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాన్ వల్ల భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు : మిచాంగ్ తుపాన్‌పై మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా అక్కడికి చేరుకోవాలన్నారు. నావూరు పెద్దవాగు వద్దకు వెళ్లి పరిశీలించామని, ప్రధానంగా వ్యవసాయ, జలవనరులు, పోలీసు శాఖలతో మాట్లాడామన్నారు. తుపాను ప్రభావం తగ్గేంత వరకు ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

విడవలూరు : తుపాన్ నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు తీరప్రాంత గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. అనంతరం రామచంద్రాపురంలో తీరాన్ని పరిశీలించి మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే అధికారులకు సహకరించి పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అలల తీవ్రత నేపథ్యంలో బోట్లు, పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ముఖ్యంగా సోమ, మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలతో పాటు గాలులు ఉంటాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అధికారులకు సహకరించాలి

కోవూరు : పెన్నా పరీవాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారులకు సహకరించి సురక్షిత ప్రాంతాలకు రావాలని తహసీల్దార్ ఎం.పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి కోరారు. కోవూరు మండలంలోని వేగూరు, పోతిరెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో వీరు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాల కోసం ఇప్పటికే పలు పాఠశాలల భవనాలు, కమ్యూనిటీ హాళ్లను సిద్ధం చేసినట్లు తెలియజేశారు.

పరిశీలన

మండలంలోని పడుగుపాడు, చంద్రమౌళినగర్ తదితర ప్రాంతాలను ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ పద్మలతో పాటు కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి సమీపంలో గుంత పడిన ప్రాంతాన్ని సందర్శించి మరమ్మతుల నిమిత్తం నేషనల్ హైవే అధికారులకు సమాచారం అందించారు.

కాచి చల్లార్చిన నీటిని సేవించాలి

పొదలకూరు : వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని సేవించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తెలియజేశారు. పట్టణంలోని ఎమ్మార్వో కాలనీ, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో వైద్యారోగ్య అధికారులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులతో మాట్లాడుతూ వర్షాలకు కలుషిత నీరు సేవిస్తే వాంతులు, విరేచనాలు అవుతాయని, టైఫాయిడ్ జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి టి.రవికుమార్, సహాయకులు ఎం.రాధాకుమారి, సాని శివప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, ఆశావర్కర్లు సీత, లక్ష్మి, ఉష పాల్గొన్నారు.



కోవూరు : వేగూరులో వర్షపు నీటిని పరిశీలిస్తున్న అధికారులు



కోవూరు : హైవే పక్కన గుంతను పరిశీలిస్తున్న అధికారులు



పొదలకూరు : ఎమ్మార్వో కాలనీ వాసులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు



విడవలూరు : తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎంపీడీఓ

గిరిజనులకు పునరావాసం

ముత్తుకూరు : తుపాన్ ప్రభావంతో కుండపోత వర్షాలకు వణికిపోతున్న తీరప్రాంత గ్రామాల్లో అధికారులు ఆదివారం పర్యటించారు. మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సోమయ్య, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ లక్ష్మణకుమార్ తదితరులు నేలటూరు, పైనాపురం తీరప్రాంత గ్రామాల్లో పర్యటించారు. పొంగి ప్రవహిస్తున్న బకింగ్‌హామ్ కాలువ, ఉప్పుటేరులను పరిశీలించారు. వర్షాల వల్ల తలెత్తే సమస్యలను స్థానికులతో చర్చించారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న నేలటూరు గిరిజనులకు యూపీస్కూల్‌లో పునరావాసం కల్పించి, ఇతర సౌకర్యాలు సమకూర్చారు.

48.7 ఎంఎం వర్షపాతం

మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల తీరప్రాంతంలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. ఆదివారం ఉదయానికి 48.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంట పొలాలు దొరువుల్లా మారాయి.



ముత్తుకూరు : పైనాపురం వద్ద ఉప్పుటేరును పరిశీలిస్తున్న అధికారులు



ముత్తుకూరు : నేలటూరులో గిరిజనులకు ఏర్పాటు చేసిన పునరావాసం

పంట పొలాల పరిశీలన



నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

కోవూరు : మండలంలోని పది గ్రామాల్లో 2,700 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. ఎక్కువ భాగం బీపీటీ 5204, ఆర్‌ఎస్‌ఆర్ 15048 తదితర రకాలు నారుమడుల దశలో ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు నాట్లు వేసిన పొలాలు, నారుమడులు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగి ఉన్నాయి. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు ఆదివారం నీట మునిగిన నారుమడులు, వరినాట్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్‌ను కలిపి చల్లుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు నారాయణ, రైతులు పాల్గొన్నారు.

12న మహామృత్యుంజయ హోమం

నెల్లూరు(బృందావనం): కార్తీక అమావాస్యను పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో మహా మృత్యుంజయ పాశుపత హోమాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాలింగార్చనను డిసెంబర్ పదిన నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వివరాలకు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరమశివా.. ప్రణామం



నెల్లూరు(బృందావనం): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు పరమశివుడికి కళారూపమిచ్చారు. ఆరంగుళాల ఎత్తు, నాలుగంగుళాల వెడల్పుతో 124 ఇనుప నట్లు.. 45 టమోటాలతో 12 అంగుళాల ఎత్తు, 8 అంగుళాల వెడల్పుతో శివలింగాలను తీర్చిదిద్దారు.

చిగురిస్తున్న ఆశలు

పొదలకూరు : మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. తుపాను ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే నార్లు పోసుకునేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. కొన్ని గ్రామాల్లో నార్లు పోసుకుని ఉండగా, మరికొన్ని గ్రామాల్లో విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరుపూరు గ్రామంలో నాయుడు చెరువు, పెద్దచెరువు, చిన్నచెరువులు ఉన్నాయి. ఈ మూడు చెరువుల్లోకి రెండు మాసాలకు సరిపడా నీరు చేరినట్లు రైతులు వెల్లడించారు. మండలంలో శనివారం 48 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. చెరువులకు నీటి లభ్యతపై వ్యవసాయ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఏఓ ఎ.వాసు మాట్లాడుతూ రైతులు నార్లు పోసుకుని సమయం వృథా చేసుకునే కంటే ఆధునిక వ్యవసాయ పద్ధతిలో నేరుగా వరి విత్తనాలను చల్లుకోవాల్సిందిగా సూచించారు. డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు విత్తేతే సమయం కలిసివస్తుందని తెలిపారు. రైతులు యంత్రాల ద్వారా నాట్లు వేసుకుంటే సమయం వృథా కాదని సూచించారు. తాటిపర్తి గ్రామంలో ఇటీవల వరిసాగులో భాగంగా నార్లు పోసుకోకుండా నేరుగా విత్తనాలు చల్లుకునే పద్ధతికి అలవాటు పడుతున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావం చూసుకుని రైతులు నార్లు పోసుకోవాల్సిందిగా తెలియజేశారు.



మాగాణి పొలాల్లో నిలబడిన వర్షపు నీరు

అనుమతులు లేకుండానే రోడ్ల తవ్వకం

పొదలకూరు : మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లను కొందరు అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా తవ్వేస్తుండడంతో వాహనచోదకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా నావూరు రోడ్డులో రైతులు అడ్డగోలుగా తవ్వేసి పైపులు వేసుకుని సక్రమంగా గుంతలను పూడ్చకపోవడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఏడు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల సమీపంలో తోటలకు సాగునీరందించేందుకు రహదారిని తవ్వి పైపులైన్ నిర్మిస్తున్నారు. పైపులు పూడ్చిన ప్రాంతాల్లో వర్షాలకు పెద్ద గుంతలు ఏర్పడి రాత్రి వేళల్లో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. కనుపర్తి, అల్లూర్తి తదితర గ్రామాల రోడ్లపైన ఇలాంటి గుంతలే ఉన్నాయి. అసలే మలుపులు అధికంగా ఉన్న ఈ రహదారిల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల చాటగొట్ల–బిరదవోలు కొత్త రోడ్డును ఎలాంటి అనుమతి లేకుండా తవ్వి పైపులైన్ వేశారు. అనంతరం రోడ్డును నామమాత్రంగా పూడ్చడంతో పొదలకూరులో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందారు. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. రోడ్డును అనుమతి లేకుండా తవ్వకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. తవ్వినా గుంతలను సక్రమంగా పూడ్చకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనిపై సంబంధిత ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు.



పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డును తవ్వేసిన దృశ్యం